# ప్రభుత్వ స్థలాల నివేదికలు ఇవ్వాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



మక్తల్‌లో ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, అక్టోబర్ 18 : మక్తల్ పట్టణంలో ప్రభుత్వ స్థలాలకు వెళ్లే రహదారుల వివరాలను పూర్తి నివేదికతో అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మక్తల్ తాసీల్దార్ సతీష్‌తో కలిసి మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న 150 పడకల దవాఖాన నిర్మాణం కోసం పట్టణ శివారులోని ప్రభుత్వ సర్వేనెంబర్ 916, 917లోని పదెకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. పట్టణానికి సమీపంలో ఉన్న ట్యాంక్‌బండ్ వద్ద గల 316 సర్వేనెంబర్‌లోని భూమిని పరిశీలించి మున్సిపల్ దుకాణ సముదాయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మక్తల్ సమీపంలోని గొల్లపల్లి శివారులో సర్వేనెంబర్ 126లో 18ఎకరాల భూమిలో ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించామన్నారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ సతీష్, సర్వేయర్ ఉన్నారు.

## 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

నారాయణపేట, అక్టోబర్ 18 : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి 31వతేదీ వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్పీ కార్యాలయంలో విలేకరుల మాట్లాడుతూ పోలీస్ విధులు, వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, పోలీసుల సేవలు తదితర విషయాలపై ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్‌లోపు, డిగ్రీ ఆపైస్థాయి విద్యార్థులకు, కానిస్టేబుల్, ఎస్సై స్థాయి ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన మొదటి ముగ్గురిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. అదేవిధంగా రక్తదాన శిబిరాలు, షార్ట్ ఫిలిమ్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తామన్నారు. పబ్లిక్ స్థలాల్లో పోలీసు అమరవీరుల గురించి తెలుపుతూ పాటల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## మైగ్రేషన్ అండ్ హ్యూమన్ రీసోర్స్ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ప్రిన్సిపాల్, రచయిత, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 18 : వలసలు, గ్రామీణ ప్రాంతాల్లో మానవ వనరుల కొరత అనే పుస్తకాన్ని శుక్రవారం పాలమూరు యూనివర్సిటీలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత వెంకట రాఘవేందర్‌ను అభినందించారు. యూనివర్సిటీకి మరింత మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వలసలు వెల్లడంతో మానవ వనరుల, శ్రామిక కొరతతో వ్యవసాయ, చిన్న పరిశ్రమల ఉత్పాదకత కుంటుపడుతుందన్నారు. గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి మైగ్రేషన్ అండ్ హ్యూమన్ రీసోర్స్ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, జేడీ అంకం భాస్కర్, సీనియర్ అధ్యాపకుడు కిశోర్, విభాగాధిపతి జిమ్మి కాటన్, అధ్యాపకులు వేణు, రవికుమార్, అర్జున్‌కుమార్, పర్వతాలు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జడ్చర్ల : విజేతలకు మెడల్స్ అందజేత..

మక్తల్, అక్టోబర్ 18 : ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని డ్రాగన్ చోటే కరాటే టూ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు సలాంబిన్ కుమార్ అన్నారు. శుక్రవారం మక్తల్ లయన్స్ క్లబ్ భవనం ఆవరణలో నారాయణపేట జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. 100 మంది విద్యార్థులు పాల్గొనగా, అండర్-14 విభాగంలో శ్రావణి, ప్రజ్ఞ, శిరీష, ఉమాశ్రీ, ధరణి, అవని, శృతి, శ్రీ చరణ్, కేదార్, కార్తీక్, శ్రీనాథ్, వంశీ తేజ, సిద్ధార్థ, హర్షవర్ధన్, నితిన్, విష్ణువర్ధన్ ఎంపిక కాగా, అండర్-17 విభాగంలో అభిలాష్, వీరేంద్ర, కార్తీక్, శ్రావ్య, మాయ, వైశాలి, కీర్తి, ముస్తఫా, రుక్సానా ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వీరు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అంజన్‌ప్రసాద్, అమ్రేశ్, ఇస్మాయిల్, ఎండీ సలీం, వెంకటేశ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

***జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు***

జడ్చర్ల, అక్టోబర్ 18 : జడ్చర్లలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 16మండలాలకు చెందిన 14ఏండ్లలోపు బాలబాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు మెడల్స్‌ను అందజేశారు. అదవిధంగా వాలీబాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో దేవరకద్ర మండల టీం విజేతగా నిలువగా, రన్నరప్‌గా బాలానగర్ మండల టీం నిలిచింది. అదేవిధంగా బాలికల విభాగంలో జడ్చర్ల(రూరల్) మండల టీం విజేతగా నిలువగా, రన్నరప్‌గా కోయిల్‌కొండ మండల టీం నిలిచింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**కావలెను**

★ ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో టీమ్ లీడర్స్‌గా మహబూబ్‌నగర్ మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పని చేయుటకు M/F కావలెను. అర్హత 10th ఆపై, వయస్సు: 25 ఆపై . సంప్రదించు సెల్: 9393055164.

NT-MBNR

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

- కలెక్టర్ విజయేందిర బోయి
- ప్రభుత్వ జనరల్ దవాఖాన తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 18 : జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖాన వార్డులు, ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రభుత్వ జనరల్ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల తర్వాత మళ్లీ దవాఖానను తనిఖీ చేస్తానని, అపరిశుభ్రంగా కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఐసీయూను సందర్శించారు. వెంటిలేటర్లు ఎన్ని ఉన్నాయని, ఇంకా కావాల్సి ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. హరేరామ హరే కృష్ణ ద్వారా అందిస్తున్న రూ.5ల భోజనం గురించి తెలుసుకున్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్‌లో వ్యాధి నిర్ధారణ చేసే సీమెన్ యంత్రం నిర్వహణలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్ట్రెచర్లు, వీల్‌చైర్ ఇతరత్రా వసతులు కావాలంటే ప్రతిపాదనలు అందించాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, దవాఖాన సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పద్మ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు ఉన్నారు.

## పారిశుధ్య సమస్యలు రానీయొద్దు

జడ్చర్ల, అక్టోబర్ 18 : జడ్చర్ల మున్సిపాలిటీలోని వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజయ్య పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో డ్రైనేజీలను పరిశీలించి శానిటేషన్ సిబ్బందితో మాట్లాడారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో ఎక్కడ కూడా చెత్తాచెదారం లేకుండా ప్రతి రోజూ శుభ్రం చేయాలని తెలిపారు.

## మత్స్యకారుల అభివృద్ధికి పెద్దపీట

మిడ్జిల్, అక్టోబర్ 18 : మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నల్లచెరవులో మత్స్యకారులతో కలసి చెరువులో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గౌస్,వెంకటయ్య, బాల్‌రెడ్డి, బాలయ్య, ఆదామ్, శంకర్, జహీర్, ఉస్మాన్, వెంకటయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

భూత్పూర్, అక్టోబర్ 18 : పట్టణంలోని సారిక టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ట్రైబల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి దిలిప్‌కుమార్ ఇటీవల మృతిచెందాడు. శుక్రవారం ఆ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగులు రూ.లక్షా 30వేల ఆర్థికసాయాన్ని మృతుడి భార్య సోమేశ్వరికి అందజేసినట్లు ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిషిత, రాములు, ఉమాపతి, పవన్‌కుమార్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

మిడ్జిల్, అక్టోబర్ 18 : వెంచర్‌లో ప్లాట్లను వ్యవసాయ భూమిగా మార్చి రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకొవాలని బీజేపీ నాయకులు శుక్రవారం తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 2007లో రెయిన్‌బో వెంచర్ 25 ఎకరాల్లో సుమారు 600 పాట్లు చేశారని, ఇటీవలే వెంచర్‌ను వ్యవసాయ భూమిగా చూపించి మరో వ్యక్తికి పేరుపై కొనుగోలు చేసి అక్రమాకు పాల్పడినట్లు తెలిపారు.

## వ్యక్తిపై కేసు నమోదు

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 18 : దాడి చేసిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గోపాల్‌రెడ్డి తెలిపారు. అడ్డాకుల మండలంలోని కందూరుకు చెందిన మణెమ్మ, కాశన్న శుక్రవారం పశువులతో వెళ్తున్నారు. అటువైపు వచ్చిన కాటవరం తండాకు చెందిన జాటావత్ శంకర్ బైక్‌పై వెళ్తుండగా, పశువులు తగిలి కిందపడినట్లు తెలిపారు. శంకర్ ఆగ్రహంతో కట్టెను తీసుకొని కాశన్నను కొట్టాడు. అడ్డ వెళ్లిన మణెమ్మపై కూడా కర్రతో దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

## అన్ని గ్రామాలకు బస్సులను నడపాలి

నారాయణపేట రూరల్, అక్టోబర్ 18 : పేట జిల్లాలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని కోరుతూ శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పేట డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు శ్రీశైలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కో కన్వీనర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ దసరా సెలవులు ముగిసి 6రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు చాలా గ్రామాలకు బస్సులను నడిపించడం లేదని వెంటనే అన్ని గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భానుప్రసాద్, శివకుమార్, బాలకృష్ణ, నరేశ్, అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## వారాంతపు సెలవులు అమలు చేయాలి

మక్తల్, అక్టోబర్ 18 : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మక్తల్‌లో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మక్తల్ మున్సిపల్ కార్యాలయంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ మాట్లాడుతూ సబ్బులు, చెప్పులు, నూనె, బట్టలు ఇవ్వాలన్నారు. 80మంది కార్మికులు అవసరం ఉండగా, కేవలం 40మందితో పని చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రాములు, ఈశ్వరయ్య, అశోక్, రవి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## శిశువు మృతిపై విచారణ

జడ్చర్ల, అక్టోబర్ 18 : జడ్చర్లలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిలో బుధవారం పురిటిలోనే శిశువు మృతిచెందిన ఘటనపై ఆసుపత్రిలో వైద్యావిధాన పరిషత్ రాష్ట్ర ఇన్వెస్టిగేషన్‌టీం రహస్య విచారణ చేపట్టింది. శుక్రవారం ఆసుపత్రికి వచ్చి శిశువు మృతిపై ఆసుపత్రిలో పని చేసే డాక్టర్లు, నర్సులు, శిశువు కుటుంబసభ్యులతో వివరాలు సేకరించారు. విచారణలో వచ్చిన వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు సూపరింటెండెంట్ చంద్రకళ తెలిపారు.

## కళాకారుడికి సన్మానం

ధన్వాడ, అక్టోబర్ 18 : మండలంలోని గున్ముక్ల గ్రామంలో వెలిసిన స్వయంభూ కడపరాయ స్వామిపై రూపొందించిన భక్తి పాటల రచయిత, కళాకారుడు వీరేశ్‌ను శుక్రవారం గున్ముక్ల గ్రామంలో అఖిలపక్ష నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడపరాయ స్వామిపై అద్భుతంగా 20పాటలను రచించి పాడి క్యాసెట్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు సుధీర్‌కుమార్ రావు, శ్రీనివాసులు, అడ్వకేట్ రఘోత్తమ్ రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ జట్టుకు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైన జాజాపూర్ విద్యార్థులు

నారాయణపేటరూరల్, అక్టోబర్ 18 : పేట మినీస్టేడియంలో 68వ ఎస్‌జీఎఫ్ అండర్-17 మండల స్థాయి వాలీబాల్ పోటీలు, సెలక్షన్లు గురువారం జరిగాయి. ఇందులో పేట మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో రాఘవేణి, మానస 9వ తరగతి, సంధ్య 8వ తరగతి విద్యార్థిని ఎంపిక కాగా, అఖిల్, శివసాయి, గౌతమ్ 10వ తరగతి బాలుర విభాగంలో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్తులతో పాటు పాఠశాల జీహెచ్‌ఎం భారతి, పీడీ నర్సింహులు, ఉపాధ్యాయులు విజయ, మధుసూదన్‌రావు, భానుప్రకాశ్ , లక్ష్మణ్, నర్సింహ, ప్రతాప్, మంగళ, నిర్మల, శిరీషా, రఘురామేశ్వర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

## 'ఉపాధి' గోల్‌మాల్‌పై విచారణ చేయించాలి



శిక్షణ కలెక్టర్ గరీమగరులకు ఫిర్యాదు చేస్తున్న యువకులు

మరికల్, అక్టోబర్ 18 : మండలంలోని కన్మనూర్ గ్రామంలో నాలుగేండ్లుగా ఉపాధి హామీ పథకం పనుల్లో గోల్‌మాల్ జరుగుతుందని, పనిచేయని కూలీలకు కూలి వేసి ఫీల్డ్ అసిస్టెంట్ తన ఖాతాల్లో డబ్బులు జమ చేసుకుంటున్నారని కన్మనూర్ గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కలెక్టర్ గరీమనరులకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా ఉపాధి హామీ పథకంలో కూలీలకు సరైన కూలీలు వేయటం లేదని, కూలీ పనులు చేయని వారికి కూలీలు వేస్తూ వారి నుంచి డబ్బులు తన వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకుంటున్నారని యువకులు వరప్రసాద్, రఘుపతిరెడ్డి ఆరోపించారు. రూ.లక్షలు గోల్‌మాల్ జరిగిందని, విచారణ చేపట్టి కూలీలకు న్యాయం చేయాలని శిక్షణ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా శిక్షణ కలెక్టర్ మాట్లాడుతూ విచారణ కోసం ఆదేశించామని, వీలైనంత త్వరగా విచారణ జరిపి ఫిల్డ్ అసిస్టెంట్ , గతంలో ఉన్న ఎంపీవోపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రికార్డులు అధికారులకు ఇవ్వకుండా ఫీల్డ్ అసిస్టెంట్ మతీన్ తన ఇంట్లోనే ఉంచుకున్నారని శిక్షణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఖచ్చితంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆమె వారికి హామీ ఇచ్చారు. వలస వెళ్లిన వారు, హైదరాబాద్‌లో పనిచేస్తున్నవారు, వివిధ పట్టణాల్లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నవారు, గ్రామంలో పనిచేయడానికి చేతకాని వారికి పని చేసినట్లు ఖాతాల్లో డబ్బులు జమచేసి తర్వాత వారి నుంచి వారి నుంచి తన ఖాతాలోకి డబ్బులు మార్చుకోవడం జరిగిందని వారు శిక్షణ కలెక్టర్‌కు వివరించారు.

## రోగులకు మెరుగైన సేవలు అందించాలి



రోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో

నారాయణపేట టౌన్, అక్టోబర్ 18 : పాలియేటివ్ కేర్ సెంటర్‌లోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రపంచ ధర్మశాల, పాలియేటివ్ కేర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి రోగులతో కేక్ కట్ చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రాఘవేందర్, డీపీవో భిక్షపతి, కో ఆర్డినేటర్ వసంత, పాలియేటివ్ కేర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 18 : జిల్లాలో మత్స్య సంపద పెంచి మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా మత్స్య శాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్న సయ్యద్ అతికూర్ రహమాన్ కలెక్టరేట్‌లో సిక్తాపట్నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

## మందులను పరిశీలించిన జేడీ

జడ్చర్ల, అక్టోబర్ 18 : జడ్చర్లలోని 100పడకల ఆసుపత్రిలో ఉన్న మందుల స్టాక్‌ను శుక్రవారం మెడికల్ అండ్ హెల్త్ జాయింట్ డైరక్టర్ శివబాలాజీ పరిశీలించారు. జేడీ వెంట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నిత్యానందరావు



పాలమూరు, అక్టోబర్ 18 : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ప్రముఖ పరిశోధకుడు, రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిద్యానందరావు నియామకమయ్యారు. దీంతో పాలమూరు సాహితీ అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. నిత్యానందరావు ఉమ్మడి పాలమూరు జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరుకు చెందినవారని తెలిపారు.

## సమయానికి బస్సులు నడిపించాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 18 : పాఠశాలలు, కళాశాల సమయానికి బస్సులను నడిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కో కన్వీనర్ పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు భానుప్రసాద్, శివకుమార్, బాలకృష్ణ, నరేశ్, అశోక్ పాల్గొన్నారు.

## కేబుల్ వైర్ చోరీ

నవాబ్‌పేట, అక్టోబర్ 18 : మండలంలోని లోకిరేవు, లింగంపల్లి ఊరంచుతండా గ్రామాలకు చెందిన రైతుల బోరుబావుల వద్ద కేబుల్ వైర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. లోకిరేవుకు చెందిన వెంకటయ్య, ప్రభాకర్, ఏకాంబరం, లింగంపల్లికి చెందిన బాలకిష్టయ్య, రవి, లక్ష్మణ్, తూక్యానాయక్‌తోపాటు మరో 20మంది రైతుల బోరుబావుల వద్ద దొంగలు కేబుల్ వైరును ఒకే రోజు రాత్రి అపహరించుకుపోయినట్లు వివరించారు.

## ఎస్సీ వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపన్న

దేవరకద్ర, అక్టోబర్ 18 : ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న అన్నారు. శుక్రవారం దేవరకద్రలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఆ ర్డర్ ఇచ్చినా కూడా రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఎస్సీ వర్గీకరణపై నోరుమెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నవాబ్‌పేట, అక్టోబర్ 18 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విక్రమ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నవాబ్‌పేట మండలంలో కొంత మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయారని గుర్తుచేశారు.

***అవగాహన పెంచుకోవాలి..***

బాలానగర్, అక్టోబర్ 18 : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతోపాటు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపాజీ అన్నారు. శుక్రవారం సాయంత్రం బాలానగర్ సంతబజారులో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## మత్తుకు దూరంగా ఉండాలి

మక్తల్, అక్టోబర్ 18 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆచారి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తుకు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## నేడు విశ్వహిందూ పరిషత్ ధర్నా

పాలమూరు, అక్టోబర్ 18 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉదయం 10:30గంటలకు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేవీదేవతల విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ధార్మిక సంస్థలు, వినాయక మండపాల నిర్వాహకులు, భజనమండలి సభ్యులు, భక్తులు విజయవంతం చేయాలన్నారు.

## బాధితుడికి ఎల్‌వోసీ అందించిన ఎమ్మెల్యే



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూర్, అక్టోబర్18 : మండలంలోని తిప్రాస్‌పల్లికి చెందిన పరశురాం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో శుక్రవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వైద్య సహాయం పొందేందుకు రూ. లక్షా 90వేలు ఎల్‌వోసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలి

మరికల్, అక్టోబర్ 18 : ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించాలని, హరిత విప్లవంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఫౌండర్ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీవాణి విద్యామందిర్‌లో స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమంలో భాగంగా ఆయన విద్యార్థులతో మొక్కలను నాటించారు. కార్యక్రమంలో యువక మండలి కార్యదర్శి రాఘవేందర్, యూత్ నాయకులు రాజేశ్, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీనితమ్మ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సభ్యులు రామాంజనేయులు, నగేశ్, కొత్తపల్లి రవి, పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్‌ను ఎత్తివేయాలి

భూత్పూర్, అక్టోబర్ 18 : రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్‌ను ఎత్తి వేయాలని బీసీ జాగృతి సేన అధ్యక్షుడు కృష్ణయాదవ్ కోరారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ బీసీలను ఆర్థికంగా అడ్డుకునేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో 7శాతం అగ్రకులాలు ఉండగా, అందులో 2శాతం మంది మాత్రమే పేద వర్గానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. అగ్రవర్ణాలను అభివృద్ధి చేసేందుకే ఈడబ్ల్యూఎస్‌ను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. దీని మూలంగా ఇటీవల డీఎస్సీ ఉద్యోగాల్లో బీసీలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. తమిళనాడు, బీహార్ రాష్ట్రాల్లో ఈడబ్ల్యూఎస్ విధానాన్ని అమలు చేయడం లేదని గుర్తుచేశారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయకపోతే బీసీ సంఘాలన్నీ ఏకమై ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగన్న, బీసీ సంఘం నాయకులు బాలస్వామి, గోపాల్, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్రూం సమస్యలు పరిష్కరిస్తాం

భూత్పూర్, అక్టోబర్ 18 : పట్టణంలోని సిద్ధాయపల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్ల వద్ద సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు హౌసింగ్ పీడీ వైద్య భాస్కర్ తెలిపారు. శుక్రవారం సామాజిక తనిఖీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకే చోట 288డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించడం వల్ల కొన్ని సమస్యలు ఉత్పన్నం కావడం సహజమన్నారు. విద్యుత్ వైర్లు లేవని, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని గుర్తించినట్లు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రూ.2లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్‌ను మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ భద్రూనాయక్, ఎస్టీఎం అజయ్‌కుమార్, డీఆర్పీ రవికుమార్, కమిషనర్ సురేందర్‌రెడ్డి, డీటీ గీత, ఆర్‌ఐలు వెంకటేశ్, బాలసుబ్రమణ్యం ఉన్నారు.

## మంత్రి నిర్లక్ష్యం తగదు

మరికల్,అక్టోబర్ 18 : గ్రామాల్లో ఏఈవోలు పడుతున్న ఇబ్బందులను మంత్రులు గుర్తించడం లేదని, వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేట జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు బొగల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయాన మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్రం ఉండడం సిగ్గుచేటన్నారు.

## 24న గ్రామంచాయతీ దుకాణాల వేలం

మరికల్,అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీకి సంబంధించిన దుకాణాలకు ఈనెల 24వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం వేలం నిర్వహిస్తారని తెలిపారు.

## క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

భూత్పూర్, అక్టోబర్ 18 : క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి మల్లికార్జున్ కోరారు. శుక్రవారం మండలంలోని అన్నాసాగర్‌లో అనుమానిత క్షయవ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 150మందికి గానూ 25మంది వ్యాధిగ్రస్తులుగా గుర్తించినట్లు తెలిపారు. తెమడతోపాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఎక్స్‌రే తీసి, ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రబ్బూ, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, ఎల్‌టీ వెంకటేశ్, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, కో ఆర్డినేటర్ గోపాలకృష్ణ, రాజుగౌడ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ హిందీపై శిక్షణ

జడ్చర్ల, అక్టోబర్ 18 : జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం కమ్యునికేషన్ స్కిల్స్ ఇన్ హిందీ పేరుతో 30రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. 30రోజుల హిందీ సర్టిఫికెట్ కోర్సును శుక్రవారం కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుకన్య మాట్లాడుతూ హిందీ విభాగం తరపున ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం కమ్యునికేషన్ స్కిల్స్ ఇన్ హిందీ సర్టిఫికెట్ కోర్సును కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది ఎన్‌సీసీ క్యాడెట్లకు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

## దాడులను అరికట్టాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 18: కొన్ని రోజులుగా హిందూ దేవుళ్ల విగ్రహాలు, మందిరాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వీహెచ్‌పీ కార్యదర్శి ప్రవీణ్, ఉత్సవ సమితి అధ్యక్షుడు రాంబాబు కోరారు. శుక్రవారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఉత్సవ సమితి నాయకులు, లోకపల్లి లక్ష్మమ్మ ఆలయ ట్రస్ట్ సభ్యులు పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాంబ్లే, జగదీశ్, ప్రకాశ్ భట్టడ్, రాధాకృష్ణ, నర్సింహులు, మహిళలు పాల్గొన్నారు.

## కూలీన ఇండ్లకు నిధులు మంజూరు

ధన్వాడ,అక్టోబర్ 18 : ఇటీవల భారీ వర్షాల కారణంగా మండలంలో కూలిపోయిన ఇండ్లకు నిధులు మంజూరు చేసినట్లు తాసీల్దార్ సింధుజా తెలిపారు. శుక్రవారం తాసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 27ఇండ్లు కూలిపోయాయని, వారి ఖాతాల్లో ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు జమ చేస్తామని తెలిపారు.